# పరీక్షా కేంద్రానికి ముందే చేరుకోవాలి

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ



ఆమనగల్లు పరీక్షా కేంద్రంలో టేబుళ్లపై సిబ్బందితో నంబర్లు వేయిస్తున్న సీఎస్ వెంకటయ్య

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 27: ఇంటర్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమయ్యే మౌలిక వసతులను సంబంధిత అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ పరీక్షలకు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్షకు అనుమతించరనే విషయాన్ని విద్యార్థులు గ్రహించాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. షాద్‌నగర్ పట్టణంలో మొత్తం 6 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో సుమారు 1994మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, 382 మంది ఒకేషనల్ విద్యార్థులు మొదటి రోజు పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. పట్టణంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 411 మంది, మొగిలిగిద్ద జూనియర్ కళాశాలలో 265 మంది, ప్రతిభ జూనియర్ కళాశాలలో 490 మంది, విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ విద్యార్థులు 382 మంది, విజేత జూనియర్ కళాశాలలో 363 మంది, విశ్వభారతి కళాశాలలో 465 మంది పరీక్ష రాయనున్నట్లు కస్టోడియన్లు వి. శ్రీకాంత్, చంద్రశేఖర్ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఉంటాయని, విద్యార్థులు, సంబంధితశాఖ ఉగ్యోగులకు మినహా ఇతరులకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతులుండవన్నారు.

**చేవెళ్లటౌన్ :** చేవెళ్లలో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ మాడల్ జూనియర్ కళాశాల, వివేకానంద జూనియర్ కళాశాల, శ్రీ చైతన్య కళాశాలలో దాదాపు మొత్తం 1200 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

**ఆమనగల్లు :** ఆమనగల్లులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రథమ సంవత్సరంలో 375 మంది, ద్వితీయ సంవత్సరంలో 275 మంది విద్యార్థులు ంహజరుకానున్నట్లు పరీక్షల సీఎస్ వెంకటయ్య తెలిపారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి



కొత్తూరు మున్సిపాలిటీలో ప్రథమ చికిత్స కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి, డా. హరికిషన్

కొత్తూరు, ఫిబ్రవరి 27: ఫస్ట్ ఎయిటెడ్ సెంటర్లలో నిబంధనలు అతిక్రమించి వైద్యం చేస్తే చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి అన్నారు. కొత్తూరు మున్సిపాలిటీలోని పలు ప్రథమ చికిత్స కేంద్రాలను మంగళవారం తనిఖీ చేశారు. నిబంధనలను అతిక్రమించి వైద్యం చేస్తున్న శ్రీనివాస ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌కు నోటీసులు అందజేశారు. అనంతరం ఆమె మండల పరిధిలోని పెంజర్లలో ఫస్ట్ ఎయిడ్ సెంటర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. చిన్న చిన్న గాయాలకు కట్లు కట్టడం, మాత్రలు ఇవ్వడం లాంటి చికిత్సలు చేయాలన్నారు. అంతే కాకుండా ఫార్మాసిస్ట్ లేకుండా మెడికల్ షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. దీంతోపాటు మెడికల్ షాపులు ఆస్పత్రి ఆవరణకు బయట ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో డా.హరికిషన్, సూపర్‌వైజర్ చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్యులు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సుకన్య

యాచారం, ఫిబ్రవరి 27 : మండల కేంద్రం లోని ప్రభుత్వ దవాఖానలో విధులు నిర్వహించే వైద్యులు, సిబ్బంది రోగులకు నిత్యం అందుబాటులో ఉండాలని ఎంపీపీ కొప్పు సుకన్య అన్నారు. మంగళవారం ఆమె దవాఖానను సందర్శించి రోగులతో మాట్లాడారు. నూతనంగా విధుల్లో చేరిన వారు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఉదయం 10 తరువాత రావడం, మధ్యాహ్నం 2 గంటలకే వెళ్లడం సరికాదన్నారు. తమ తీరు మార్చుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. దవాఖాన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

## ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని కలిసిన నాయకులు

కడ్తాల్, ఫిబ్రవరి 27 : రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన చిన్నారెడ్డిని మంగళవారం కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఆయనకు నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాట నర్సింహ, నాయకులు బాలరాజు, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘన నివాళి



ప్రభుత్వ దవాఖానాలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎస్సీ పరిరక్షణ సమితి నాయకులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 27 : ఎస్సీ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దివంగత కర్నె శ్రీశైలం జయంతిని ఆమనగల్లు పట్టణంలో రంగారెడ్డి జిల్లా ఎస్సీ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పుల నర్సింహ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాయకులతో కలిసి కర్నె శ్రీశైలం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు.

## పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 27 : గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థులతో పాటు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య అన్నారు. మండలంలోని అనాజ్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విహార ఫౌండేషన్ సౌజన్యంతో సౌండ్స్, మైక్ సిస్టంను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో విహార ఫౌండేషన్ చైర్మన్ కందాళ బలదేవ్, 2012-13 పూర్వ విద్యార్థులు వేణు, శివ, శేఖర్, గుండె గిరీశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పరీక్షలు చేయించుకుంటున్న కాలనీ వాసులు

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ఆర్కేపురం, ఫిబ్రవరి 27 : సరూర్‌నగర్ డివిజన్ వెంకటేశ్వర కాలనీ కమ్యూనిటీహాల్‌లో మంగళవారం యశోద నర్సింగ్ కళాశాల, ఎన్‌ఎస్‌ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మలక్‌పేట్ యశోద హాస్పిటల్ వైద్యుల పర్యవేక్షణలో బీపీ, షుగర్, రక్త పరీక్ష, ఈసీజీ, టుడీ ఈకో, కంటి పరీక్షలతో పాటు తదితర పరీక్షలు నిర్వహించారు. అసరమైన వారికి సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రంగ సంతోష్ కుమార్, రఘు, ధర్మతేజ, వీణకుమారి, సోఫియా, రేణుక, శ్రీధర్, కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ధనంరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసాచారి, విజయ కుమార్, సాయిరెడ్డి, శాంతిప్రసాద్, వెంకట్రావు, శ్రీనివాస్‌రావు, గోవర్ధన్‌రెడ్డి, సందీప్, నగేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీలు

కందుకూరు. ఫిబ్రవరి 27 : పలు గ్రామాల్లో దొంగలు హల్ చల్ చేశారు. తాళం వేసిన ఇండ్లను గుర్తించి చోరీ చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో నగదును, నగలను ఎత్తుకెళ్తున్నారు. మండల పరిధిలోని దెబ్బడగూడ గ్రామంలో రాత్రి తాళం వేసిన రెండిళ్లలో చోరీకి పాల్పడ్డారు. సురుసాని కమళమ్మ ఇంట్లో రూ. 42 వేలు, పక్కన గల కళ్లెం లక్ష్మమ్మ ఇంట్లో 10తులాల వెండి పట్టగొలుసులను దొంగిలించారు. నెల రోజుల నుంచి దొంగలు చోరీలకు పాల్పడటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## కలెక్టర్‌కు ఫిర్యాదు

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 27: మున్సిపాలిటీలోని 19వ వార్డు కుంట్లూరు గ్రామ శివారులోని వేంకటేశ్వర కాలనీ పక్కనే ఉన్న ఓ రెడీమిక్స్ ప్లాంట్ నుంచి వస్తున్న దుమ్ముతో రోగాలు వస్తున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తంచేశారు. కలెక్టర్ శశాంకకు మంగళవారం ఫిర్యాదు చేశారు. రెడీమిక్స్‌తోపాటు పక్కనే బ్రిక్స్ తయారు చేస్తున్నారని, వాటి వల్ల ఇబ్బందులు పడుతున్నామని వివరించారు.

## సింగరేణి కాలనీలో పోలీస్ ఔట్ పోస్ట్ ఏర్పాటు చేస్తాం



డీసీపీ జానకికి వినతి పత్రం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

సైదాబాద్, ఫిబ్రవరి 27: సింగరేణి కాలనీలో మిషన్ ఛబుత్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరుతూ సింగరేణి కాలనీ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగిలా రమేశ్ అన్నారు. మంగళవారం నాగిలా రమేశ్ నేతృత్వంలో కొంత మంది సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ జానకిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాగిలా రమేశ్ మాట్లాడుతూ సింగరేణి కాలనీలో ఛబుత్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని, పోలీస్ ఔట్ పోస్టు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా డీసీపీ జానకి సానుకూలంగా స్పందించారని మినీ పోలీస్‌స్టేషన్, సరైన బందోబస్తును ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు డేవిడ్, ప్రధాన కార్యదర్శి గుద్దేటి శ్రీను, జెంట్స్ సెక్యూరిటీ సురేశ్, కోశాధికారి డొప్ప నర్సింగ్, నర్సింగ్‌రావు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



గచ్చిబౌలి డివిజన్ పరిధి గోపన్‌పల్లి గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయ ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక పూజలకు కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి హాజరై పూజల్లో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని మహిళలు ఎల్లమ్మ తల్లికి బోనాలను సమర్పించారు.

– కొండాపూర్, ఫిబ్రవరి 27

## అభయాంజనేయ ఆలయ నూతన కార్యవర్గం

మన్సూరాబాద్, ఫిబ్రవరి 27: నాగోల్ డివిజన్ పరిధి సౌత్ శ్రీసాయినగర్‌కాలనీలోని శ్రీఅభయాంజనేయ స్వామి దేవాలయ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా మల్లేశం, కమిటీ సభ్యులుగా సీహెచ్. అశోక్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మాధవరెడ్డి, గోపాల్ శర్మ, అంజన్‌రెడ్డి, రాములుగౌడ్, రవీందర్‌రెడ్డి, వీరాంజనేయులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మల్లేశం మాట్లాడుతూ కాలనీవాసులు, దాతల సహకారంతో అభయాంజనేయ స్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. తన నియామకానికి సహకరించిన కాలనీవాసులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.



ఆలయ కమిటీ చైర్మన్ మల్లేశంను సన్మానిస్తున్న కాలనీవాసులు

## వీరన్న గుట్టలోని శివాలయాన్ని తీర్చిదిద్దుతాం

మన్సూరాబాద్, ఫిబ్రవరి 27: మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి వీరన్నగుట్టలోని శివాలయాన్ని మంగళవారం జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్యతో కలిసి కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పరిశీలించారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన పలు పనులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ మహా శివరాత్రిని పురస్కరించుకుని వీరన్నగుట్టలోని స్వయంభూ శివాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నామని తెలిపారు. చారిత్రాత్మక దేవాలయ అభివృద్ధి కోసం దేవాదాయ శాఖ అధికారులు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ డీఈ పున్నానాయక్, డీఈ లావణ్య, ఎస్‌ఎస్ చంద్రశేఖర్, జవాన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వీరన్నగుట్టలోని శివాలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

## కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెప్తారు

బడంగ్‌పేట, ఫిబ్రవరి27: మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా రెడ్డి పార్టీ మారుతారని ముందు ఊహించింది నేనని జల్‌పల్లి మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హమేద్, అధికార ప్రతినిధి సయ్యద్ అబ్దుల్ రవూఫ్, మీర్జా షాఖీర్ బేగం, అంజద్ ఖాన్ అన్నారు. మంగళవారం ఎర్ర కుంటలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తీగల కృష్ణారెడ్డి ఆయన కోడలు అనితా రెడ్డి చాలా కాలం నుంచి బీఆర్‌ఎస్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారని అన్నారు. ఏనాడు వారు పార్టీ కార్యకర్తలను పట్టించు కోలేదన్నారు. వారు పార్టీ మారడం వలన పార్టీకి ఎలాంటి నష్టం లేదన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా బీఆర్‌ఎస్ పార్టీని ఏమిచేయలేరన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి నాయకత్వంలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. ప్రజలే కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుతారన్నారు. బీఆర్‌ఎస్ పార్టీలో జడ్పీ చైర్ పర్సన్ అనితారెడ్డి ఎప్పుడు పని చేయకున్నా పార్టీ టికెట్ ఇచ్చి జడ్పీటీసీగా గెలిపించుకొని జిల్లా చైర్‌పర్సన్‌ను చేసిందన్నారు. ఆమెకు ఉన్నత పదవులు కల్పించిన తర్వాత పార్టీని విమర్శించడం వారికి తగదన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి వారు చేసింది శూన్యమన్నారు. వారి స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ మారడం జరిగిందన్నారు.



రామానుజ జీయర్ స్వామిజీని సన్మానిస్తున్న మానవ సేవ సమితి ప్రతినిధులు



చిన్నారుల నృత్య ప్రదర్శన

# ఎన్నో జన్మల పుణ్య ఫలం

**నృత్యార్చన కార్యక్రమంలో రామానుజ జీయర్ స్వామీజీ**

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 27: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత పెంపొందుతుందని శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీనివాస వృధాధర్ నాగ నారాయణ రామానుజ జీయర్ స్వామీజీ అన్నారు. చంచల్‌గూడలోని మానవ సేవ సమితి పోచమ్మ దేవాలయంలో అధ్యక్షుడు బింగి నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో నృత్యార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీనివాస వృధాధర్ నాగ నారాయణ రామానుజ జీయర్ స్వామిజీ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ పురాతన దేవాలయం స్థానంలో కొత్తగా ఆలయాన్ని నిర్మించడం ఎన్నో జన్మల పుణ్య ఫలమని అన్నారు. ఇటువంటి దైవ కార్యంలో పాల్గొన్న ప్రతి భక్తుడు ధన్యులని పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు హిందూ ధర్మ ప్రచార పరిషత్ శ్రీశ్రీశ్రీ స్వామి కమలేశ్ మహారాజ్, లవ్ ఫర్ కౌ ఫౌండేషన్ ట్రస్టీ రిదేశ్ జాగిర్‌దార్ జైన్ విచ్చేశారు. ఈ సందర్భంగా నృత్యార్చనలో చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సమితి కార్యదర్శి నరేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన

మాదన్నపేట, ఫిబ్రవరి 27: నాభిశిల (బొడ్రాయి)ప్రతిష్ఠాపన కార్యక్రమం మాదన్నపేట మహంకాళి మందిరం పక్కన బొడ్రాయి ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం గంగాపూజ, ముత్తుగ్రహణం, ధ్వజారోహణం, యాగశాల ప్రవేశం, ద్వార పూజ, మహాగణపతి గౌరీ పూజ, తదితర పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీ నాభిశిల విగ్రహన్ని మాదన్నపేట పరిసర ప్రాంతాల్లో మేళతాళాలతో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ బొక్క భూపాల్ రెడ్డి, చైర్మన్ తంగెళ్ల సుధీర్, బొడ్రాయి ఉత్సవ కమిటీ సభ్యులు రాచూరి మల్లేశ్, గుర్రం రవీందర్ రెడ్డి, మోహన్ లడ్డా, ధరమ్, విజయ్‌కుమార్, రాచూరి సాంబప్ప, జనపాల మధు, నింబోలా బాబు రావు తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ఊరేగింపులో పాల్గొన్న మాదన్నపేట బొడ్రాయి ఉత్సవ కమిటీ సభ్యులు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

## ఐవీఎఫ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

మన్సూరాబాద్, ఫిబ్రవరి 27: అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్) ఆధ్వర్యంలో మార్చి 4న నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ కరపత్రాలను మంగళవారం నాగోల్‌లోని పీబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐవీఎఫ్ ఆధ్వర్యంలో మహిళల కోసం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా దినోత్సవానికి మంత్రి సీతక్క, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ స్టేట్ జనరల్ సెక్రటరీ పబ్బ చంద్రశేఖర్, మహిళా విభాగం జనరల్ సెక్రటరీ మంజుల, ఐవీఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, సభ్యులు నరేశ్‌గుప్తా, కటకం శ్రీనివాస్, చింతల రజనీకాంత్, భువనగిరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

**ఐవీఎఫ్ పలు కమిటీల నియామకం**

అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా జాహ్నవి, హైదరాబాద్ అధ్యక్షురాలిగా చంద్రకళ, కార్యదర్శిగా జ్యోతి, వనస్థలిపురం అధ్యక్షురాలిగా సవిత, కార్యదర్శిగా భవాని, ఆర్కేపురం అధ్యక్షురాలిగా అరుణ, కార్యదర్శిగా గీత నియమితులయ్యారు. నూతన కార్యవర్గానికి ఐవీఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా నియామక పత్రాలను అందజేశారు.

## పల్లవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ఎల్బీనగర్, ఫిబ్రవరి 27 : సరూర్‌నగర్‌లోని పల్లవి అవేర్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో అవేర్ గ్లోబల్ హాస్పిటల్ సహకారంతో పల్లవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో పేదలకు పరీక్షలు, చికిత్సలు నిర్వహించారు. పల్లవి ఫౌండేషన్ చైర్మన్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వైస్ చైర్మన్ మల్క కొమురయ్య నేతృత్వంలో పల్లవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

